సాక్షి నల్లగొండ

శనివారం । 7 । జనవరి । 2023



ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు
నాగార్జునసాగర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రీడలు శుక్రవారం ముగిశాయి. - 8లో



వటపత్రశాయిగా నృసింహుడు
యాదాద్రిలో అధ్యయనోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం శ్రీస్వామి వారు వటపత్రశాయిగా దర్శనమిచ్చారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 30.0°/16°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈఓ

గుర్రంపోడు : 'మన ఊరు– మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని డీఈఓ భిక్షపతి ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మునీంఖాన్‌గూడెం, కాల్వపల్లి ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈనెల 8వ తేదీ నాటికి మొదటి విడతలతో ఎంపికైన అన్ని పాఠశాలలో పనులు పూర్తి కావాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి తొలిమెట్టు ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈఓ తరి రాము ఉన్నారు.

కోర్సులను క్రమశిక్షణతో పూర్తి చేయాలి



మాట్లాడుతున్న డీఐఈఓ దస్రూనాయక్

మిర్యాలగూడ : వృత్తి విద్యా శిక్షణను విద్యార్థులు క్రమశిక్షణతో పూర్తి చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి దస్రూనాయక్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గాయత్రీ కంప్యూటర్స్ శిక్షణ కేంద్రం, ప్రాంతీయ ఆస్పత్రిలో పొందుతున్న వృత్తి విద్యా శిక్షణను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ధన్‌రాజ్, అధ్యాపకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

బియ్యం సరఫరాను వేగవంతం చేయాలి



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్‌ఓ

దేవరకొండ : గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా ప్రక్రియను వేగవంతం చేయాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం దేవరకొండలోని గోదామును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో ఉన్న బియ్యం నిలవలు, పంపిణీకి సంబంధించిన వివరాలను గోదాం ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌గౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే రేషన్ దుకాణాలకు చేరిన బియ్యాన్ని డీలర్లు వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. హాస్టళ్లకు బియ్యం సరఫరా అవుతుందా లేదా అని ఆరా తీశారు.

సబ్సిడీలను ఎత్తేసేందుకు కుట్ర



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

చండూరు : పేదలకు ఇచ్చే సబ్సిడీ పథకాలను ఎత్తివేసేందుకు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం చండూరు మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన సీపీఎం మునుగోడు నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఉచిత విద్యుత్ ఇస్తుంటే.. కేంద్రం ఉచిత విద్యుత్‌కు మంగళం పాడాలని చూస్తోందని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలు అదుపు చేయకుండా పేదలపై భారాలు మోపే కుట్ర చేస్తోందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున, మండల కార్యదర్శి బొట్టు శివకుమార్, చంద్రమౌళి, వెంకటేశం, ధనంజయ్య ఉన్నారు.

12న క్రికెట్ టోర్నమెంట్

మర్రిగూడ : ఈ నెల 12న మండల కేంద్రంలో ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ఎండీ.రహీం, వి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.55,116, ద్వితీయ బహుమతి రూ.30,116, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు షీల్డ్‌తోపాటు రూ.7,116లు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం 9493964431 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



చండూరు సభలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎంపీ బడుగుల, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు

పేదల్లో చిరునవ్వే లక్ష్యం

- పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- చండూరులో రూ.40 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన
- నాలుగు నెలల్లో అందమైన చండూరుగా మారుస్తామని హామీ



గట్టుప్పల్‌లో చేనేత క్లస్టర్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రి కేటీఆర్

చండూరు : రాష్ట్రంలో ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. శుక్రవారం చండూరు మున్సిపల్ కేంద్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటీలో రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. రాబోయే నాలుగైదు నెలల్లో అందమైన చండూరుగా మారుస్తామన్నారు. పట్టణంలో వెజ్, నాన్ వెజ్, సమీకృత మార్కెట్ ఏర్పాటు చేసి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామన్నారు. చిరు వ్యాపారులకు రూ.50 లక్షలతో మున్సిపల్ కాంప్లెక్స్ పూర్తి చేస్తామని, రూ.2 కోట్లతో మున్సిపాలిటీ నూతన భవనానికి, రూ.8.90 కోట్లతో తేరట్‌పల్లి, గట్టుపల్ చేనేత క్లస్టర్లకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. మర్రిగూడ మండలం శివన్నగూడెం, లక్ష్మాపురం రిజర్వాయర్ల ద్వారా ఈ ప్రాంతానికి సాగునీటి వసతి కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో 46 లక్షల మంది బీడీ, నేత, గీత కార్మికులు, ఒంటరి మహిళ, దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు అండగా ఉంటూ ఆసరా పింఛన్లతో ఆర్థిక బలం చేకూర్చుతున్నామని తెలిపారు. మంచి ఆలోచనతో ఆడపిల్లల పెళ్లికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.1,00,116 ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేసుకున్న వారికి కేసీఆర్ కిట్ కింద రూ.13 వేలు అందిస్తున్నామని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు చండూరు నుంచి కొండ మల్లేపల్లి వరకు గల రోడ్డును రూ.90 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. చండూరులో శంకుస్థాపన చేసిన పనులను దగ్గరుండి పూర్తి చేయించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మంత్రి సూచించారు.

భారీగా తరలివచ్చిన జనం..

చండూరులో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. సభలో మంత్రి మాట్లాడుతున్నంత సేపూ సభికులు కేరింతలు కొట్టారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, కౌన్సిలర్లు వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

ఫార్మాను వేరే ప్రాంతానికి తరలించాలి..

గట్టుప్పల మండలం పరిధిలో ఏర్పాటు చేసే ఫార్మా కంపెనీని వేరే ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్.. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని ఆదేశించారు. శుక్రవారం గట్టుప్పల మండల కేంద్రంలో రూ.2 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.8 కోట్లతో గట్టుప్పల్, తేరట్‌పల్లి ఏర్పాటు చేయనున్న చేనేత క్లస్టర్లకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ నేతన్నకు ఇచ్చిన మాట ప్రకారం చేనేత క్లస్టర్ ఏర్పాటు ద్వారా గట్టుప్పల్‌లో 460 మంది, తేరట్‌పల్లిలో 190 మంది లబ్ధిదారులకు మేలు చేకూరుతుందన్నారు. చేనేత శాఖ ద్వారా ఆసు యంత్రాలు, నేతన్న బీమా, పొదుపు కార్యక్రమాలు కింద సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఉప ఎన్నికలో గట్టుప్పల్ మండల ఇన్‌చార్జ్‌గా పని చేశానని.. ఆరోజు ఇచ్చిన హామీలను అమలు చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, సర్పంచ్ ఇడెం రోజా తదితరులు పాల్గొన్నారు.



చండూరులో సభకు హాజరైన జనం



చండూరులో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్

రూ.3వేల కోట్లతో అభివృద్ధి



ఈఎస్‌ఐ డిస్పెన్సరీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన మంత్రి జగదీశ్‌రెడ్డి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో సీఎం కేసీఆర్ విజయోత్సవ సభలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతున్నామని, నియోజకవర్గంలో దాదాపు రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. హుజూర్‌నగర్‌లో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, సబ్ ట్రెజరీని ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. నియోజకవర్గంలో కొత్త లిఫ్టులు ఏర్పాటు చేయడంతోపాటు పాతవి, సాగర్ కాల్వల మరమ్మతులకు రూ.2వేల కోట్లు మంజూరు చేసింది కేసీఆర్ ప్రభుత్వమని, అని మంజూరు చేయించిన నాయకుడు ఎమ్మెల్యే సైదిరెడ్డి అని చెప్పారు. కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సైదిరెడ్డి, కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్‌డీఓ వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పంచాయతీలు నిర్వీర్యం

- 9న జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలి
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్



మాట్లాడుతున్న చెరుకు సుధాకర్

నల్లగొండ : రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యానికి మూల స్తంభాలైన గ్రామపంచాయతీలు నిర్వీర్యమవుతున్నాయని చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ విమర్శించారు. శుక్రవారం నల్లగొండలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కొండేటి మల్లయ్య, పున్న కైలాస్ నేత, తండు సైదులుగౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు ఇవ్వకుండా పక్కదారి పట్టిస్తోందని మండిపడ్డారు. సర్పంచ్‌లు అప్పులు తెచ్చి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారని.. నిధులు రాకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ధర్నా చేయడానికి సిద్ధపడ్డ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులందరినీ అక్రమంగా అరెస్టు చేసిందని ధ్వజమెత్తారు. దీనిపై కోర్టుకు వెళ్లగా.. ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందన్నారు. ఈ నెల 9న ఇందిరా పార్క్ వద్ద చేపట్టనున్న మహాధర్నాలో పార్టీలకతీతంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కామారెడ్డిలో ఇండస్ట్రీయల్ కారిడార్ విషయంలో ఇచ్చిన ప్లాన్ పేదల భూములు పోయేలా తయారు చేశారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, నల్లగొండ వైస్ ఎంపీపీ జిల్లపల్లి పరమేష్, నాయకులు అల్లి సుభాష్‌యాదవ్, పుట్టకోటయ్య, చర్లపల్లి గౌతమ్, ఇంతియాజ్ అలీ, మహేందర్, శివ, రాజు, మధు, జలందర్‌రెడ్డి, కోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా క్రీస్తు సాక్షాత్కార ఉత్సవాలు



చర్చి వేడుకలో ప్రసంగిస్తున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

కేతేపల్లి : కేతేపల్లిలోని మేరి జపమాల మాత చర్చిలో క్రీస్తు సాక్షాత్కార (ముగ్గురు రాజుల పండుగ) ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం స్థానిక చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విచారణ గురువు మాదాను ఫ్రాన్సిస్ అధ్యక్షతన జరిగిన ప్రార్థనా కార్యక్రమాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు పొరుగు జిల్లాల్లోని చర్చిలకు చెందిన 100 మంది క్రైస్తవ మత గురువులు, మత కన్యలు, భక్తులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు తన సందేశాన్నిస్తూ ప్రజల కోసం తన రక్తాన్ని చిందించిన ఏసు ప్రభువు లోకరక్షకుడని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు బోధనలను పాటించి నిర్మల జీవితాన్ని గడపాలన్నారు. వేడుకల్లో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అవ్వారి శౌరయ్య, టీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు అవ్వారి అంతోని, చర్చి కమిటీ ప్రతినిధులు పసల ఆరోగ్యయ్య, మాదాను బాలస్వామి, ఆర్లగడ్డ అమర్, జోసఫ్, విజయ్‌కుమార్, ధనరాజ్, జోజప్ప, శౌరి, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ముగ్గురు రాజుల పండుగ సందర్భంగా స్థానిక చర్చిలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. చర్చి వెలుపల పిల్లల ఆటల వస్తువులు, మహిళల అలంకరణ వస్తువులు, తిను బండారాలు తదితర దుకాణాలతో వీధి కిక్కిరిసిపోయింది. చర్చిలో ప్రత్యేకంగా నిర్మించిన మేరి మాత విగ్రహం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం వేళ మేరి మాత విగ్రహాన్ని, ఏసు శిలువను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.

బకాయిలు చెల్లించకుంటే ఆస్తులు అటాచ్

- మెప్మా పీడీ రామేశ్వర్

మిర్యాలగూడ టౌన్ : శ్రీనిధి బకాయిలను చెల్లించకుంటే ఆస్తులను అటాచ్ చేస్తామని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ శ్రీపాద రామేశ్వర్ హెచ్చరించారు. శుకవారం పట్టణంలోని సుందరయ్య పార్క్‌లో స్లమ్ లెవల్ ఫెడరేషన్, టౌన్ లెవల్ ఫెడరేషన్, రిసోర్స్ పర్సన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీల్లో శ్రీనిధి కింద తీసుకున్న రుణాల రికవరీకి ఐదుగురు సభ్యులతో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయడం చేస్తున్నామన్నారు. శ్రీనిధి బకాయిల విషయంలో ఆర్‌పీలు ఎలాంటి పొరపాట్లు చేసినా శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఎం స్వా నిధి కింద మిర్యాలగూడలో 1726 మందిని గుర్తించామని వారికి రూ.20 వేల రుణం ఇస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్‌సాగర్, శ్రీనిధి ఆర్‌ఎం మహేందర్‌కుమార్, మెప్మా డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ శివాజీనాయక్, టీఎంసీ పాతేపాక బక్కయ్య, శ్రీనిధి మేనేజర్ సుధాకర్, మల్లేశ్వరి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పార్వతి, అరుణ, అనిత తదితరులు ఉన్నారు.

పనుల నాణ్యతను పరిశీలించాలి

- విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమేష్



తోపుచర్లలో పనులను పరిశీలిస్తున్న రమేష్

మిర్యాలగూడ, రామగిరి(నల్లగొండ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ చేపడుతున్న 'మన ఊరు– మన బడి' కార్యక్రమంలో భాగంగా పాఠశాలల అభివృద్ధి, మరమ్మతు పనుల నాణ్యతను ఇంజనీరింగ్ అధికారులు తరచూ పరిశీలించాలని రాష్ట్ర విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ రమేష్ ఆదేశించారు. శుక్రవారం మాడ్గులపల్లి మండలంలోని తోపుచర్ల, తిప్పర్తి మండలంలోని కేజీబీవీ, మర్రిగూడలోని పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం విషయంలో ఆధునీక మెటీరియల్ వాడాలన్నారు. తిప్పర్తి కేజీబీవీలో మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలని ఎస్‌ఓకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ భిక్షపతి, ఎంఈఓలు బాలాజీనాయక్, అరుంధతి, ఈడబ్ల్యూఐడీసీ డీఈఈ శైలజ, గెజిటెడ్ హెచ్‌ఎం చాపల శ్రీనివాస్, కేజీబీవీ ఎస్‌ఓ రాజేశ్వరి, ఏఈ గౌస్ ఉన్నారు.

బిందు సేద్యం.. బందేనా!

- సబ్సిడీపై డ్రిప్ పరికరాలు మంజూరు చేయని ప్రభుత్వం
- జిల్లాలో తగ్గుతున్న కూరగాయలు, పండ్ల తోటల సాగు
- రెండేళ్లుగా ఎదురుచూపుల్లో 11,576 మంది రైతులు



వెలుగుపల్లిలో డ్రిప్ లేకుండా సాగవుతున్న మిర్చి తోట



రసూల్‌పురంలో దోస సాగు

నల్లగొండ రూరల్ : ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తున్న డ్రిప్ (బిందు సేద్యం) పరికరాలు రెండేళ్లుగా రైతులకు అందడం లేదు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసేలా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కొన్నేళ్లుగా అమలు చేస్తూ వచ్చిన డ్రిప్ పథకాన్ని నిలిపివేసింది. ఫలితంగా జిల్లాలో కూరగాయలు, పండ్లతోటలతోపాటు పత్తిసాగు కూడా ఏటా తగ్గుతోంది. ఒక్కసారి డ్రిప్ ఏర్పాటు చేసుకుంటే 5 ఏళ్లపాటు ఉపయోగపడుతుంది. రైతులకు ఎంతో ప్రయోజనం ఉన్న ఈ పథకం అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించకపోవడంతోపాటు కేవలం ఆయిల్‌పామ్ సాగుకే డ్రిప్ మంజూరు చేస్తుండడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్లుగా ఇవ్వని ప్రభుత్వం..

ఎకరం భూమిలో రైతు డ్రిప్ ఏర్పాటు చేసుకొని కూరగాయల పంటలు సాగు చేయాలంటే దాదాపు రూ.40 నుంచి రూ.50 వేలు ఖర్చు వస్తుంది. అలాగే పండ్లతోటలకు రూ.30 వేలు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వం సబ్సిడీపై కూరగాయల సాగుకు ఎకరానికి రైతు వాటాగా జీఎస్‌టీతో కలిసి రూ.5 వేలలోపు.. పండ్లతోటలకు రూ.4 వేల లోపు చెల్లిస్తే డ్రిప్ అందజేస్తుంది. కాగా, ప్రభుత్వం నుంచి ఉద్యానశాఖ ద్వారా రెండేళ్లుగా కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతోటల సాగుకు డ్రిప్ ఏర్పాటుకు సబ్సిడీపై ఇవ్వడంలేదు. ఫలితంగా ఆర్థికంగా ఉన్న రైతులు మాత్రమే డ్రిప్ ఏర్పాటు చేసి సాగు చేస్తున్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 39,295 ఎకరాల్లో కూరగాయలు, ఆకుకూరలు, పత్తి, చెరుకు, ఎర్ర చందనం, శ్రీగంధం, పందిరి కూరగాయలు, పట్టు సాగు, డ్రాగన్ ఫ్రూట్, సుగంధద్రవ్యాల సాగుకు డ్రిప్ పరికరాలు కావాలని 11,576 మంది రైతులు ఉద్యానశాఖకు దరఖాస్తులు చేసుకున్నారు.

డ్రిప్‌కు దరఖాస్తు చేసుకున్న రైతుల భూమి విస్తీర్ణం (ఎకరాల్లో)



పండ్లతోటలు 22,182	కూరగాయలు 8,330
పత్తి, చెరుకు 8,360	ఇతర పంటలు 423
మొత్తం 39,295	

భారమవుతున్న సాగు..

పండ్ల తోటలు, కూరగాయలు, పత్తి, చెరుకు పంటలు డ్రిప్ లేకుండా సాగు చేయడం రైతులకు ఆర్థికంగా భారం అవుతోంది. డ్రిప్‌తో భూగర్భ జలాల వినియోగం తక్కువగా ఉండడంతోపాటు విద్యుత్ ఆదా అవుతూ, రైతుకు కూలీల ఖర్చు తగ్గుతుంది. ఈ క్రమంలో ఎకరం విస్తీర్ణంలో వరిసాగుకు 76,23,200 లీటర్ల నీటిని ఉపయోగిస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ నీటితో డ్రిప్ పద్ధతిలోనైతే 5 ఎకరాల్లో పండ్లతోటలు, 4 ఎకరాల్లో కూరగాయల సాగును సులభంగా చేపట్టవచ్చని గణాంకాలు చెబుతున్నాయి. డ్రిప్ లేకపోవడంతో రైతులకు సాగు ఇక్కట్లు తప్పడం లేదు. కాల్వల ద్వారా నీటి తడులు ఇవ్వడంతో కలుపు పెరగడం, నీరు, విద్యుత్ వృథా అవుతాయి. వీటికితోడు సాధారణ పద్ధతిలో అవసరం లేని చోట ఎరువులు పడటంతో ఇంకా అధికంగా కొనాల్సి వస్తోందని, తద్వారా సాగు భారంగా మారుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిందు సేద్యాన్ని ప్రోత్సహించి ఏటా సబ్సిడీపై పరికరాలు అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



జిల్లా వ్యాప్తంగా డ్రిప్ కోసం రైతుల నుంచి ఒత్తిడి ఉంది. డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసిన రైతుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం ఆయిల్ పాం సాగుకే డ్రిప్ మంజూరు చేస్తున్నాం.
– సంగీతలక్ష్మి, పీడీ, ఉద్యాన, పట్టుశాఖ

డ్రిప్ మంజూరు చేయాలి



డ్రిప్ కోసం ఏడాది క్రితం దరఖాస్తు ఇచ్చినా నేటికీ మంజూరు కాలేదు. ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా డ్రిప్ ఇవ్వకపోవడంతో ఐదెకరాల్లో దోస, మిర్చి, ఇతర కూరగాయల పంటలను కాలువల ద్వారా నీరందించి సాగు చేస్తున్నా. ప్రభుత్వం డ్రిప్ మంజూరు చేయాలి.
– చంద్రారెడ్డి, రైతు, రసూల్‌పురం, నల్లగొండ మండలం

క్లుప్తంగా

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు

తుంగతుర్తి : చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తి ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.15లక్షల పరిహారం చెల్లించాలని తుంగతుర్తి జూనియర్ సివిల్‌కోర్టు జడ్జి కె.సురేష్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నర్ర కొండల్‌రావుకు సూర్యాపేట మండలం బాలెంలకు చెందిన గోదాల రంగారెడ్డి 2013లో రూ.12లక్షల చెక్కు ఇచ్చాడు. రంగారెడ్డి సకాలంలో సొమ్ము జమచేయకపోవడంతో బాధితుడు తుంగతుర్తిలోని జూనియర్ సివిల్‌కోర్టును ఆశ్రయించగా కోర్టు 2014లో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం చెక్ బౌన్స్ అయిన కారణంగా రంగారెడ్డికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.15లక్షల పరిహారాన్ని కొండల్‌రావుకు మూడు నెలల్లోగా చెల్లించాలని కోర్టు తీర్పు వెల్లడించింది. డబ్బులు చెల్లించని ఎడల మరో ఆరు నెలల పాటు సాధారణ జైలు శిక్ష అమలవుతుందని తీర్పునిచ్చారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు



నిందితులను చూపుతున్న అధికారులు

నల్లగొండ క్రైం : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను టూటౌన్ పోలీస్‌లు అరెస్ట్ చేసి వారి నుంచి కిలోన్నర గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సోమిడి సంతోష్‌రెడ్డి, రాక్‌హిల్స్ కాలనీకి చెందిన మెడబోయిన చక్రి ఇద్దరు కలిసి విశాఖపట్నంలో గంజాయిని కొనుగోలు చేసి పట్టణంలో విక్రయిస్తున్నారు. దీంతో పోలీసులకు నమ్మదగిన సమాచారం అందడంతో వెతుకుతుండగా పోలీసులను చూసిన నిందితులు పారిపోయారు. దీంతో వారిని వెంబడించి పట్టుకుని, రెవెన్యూ అధికారుల సమక్షంలో గంజాయిని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం వారిని విచారించగా విద్యుత్‌నగర్‌కు చెందిన రాబిన్ అలియాస్ సాయి, వీటీ కాలనీకి చెందిన సంతోష్, సహజ్‌రెడ్డి, పద్మానగర్‌కు చెందిన సాయిగణేష్‌లతో కలిసి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నట్లు పట్టుబడిన నిందితులు వెల్లడించారు. మిగతా వారికోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలిపాలని ఆయన కోరారు.

వటపత్రశాయిగా నృసింహుడు

- రాత్రి పరమపదనాథుడిగా దర్శనమిచ్చిన యాదాద్రీశుడు
- నేటితో ముగియనున్న అధ్యయనోత్సవాలు



వటపత్రశాయి అలంకార సేవ ముందు ప్రబంధ పారాయణం పఠిస్తున్న ఆచార్యులు



వైకుంఠనాథుడి అలంకార సేవలో శ్రీస్వామివారు

యాదగిరిగుట్ట : వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ అధ్యయనోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీస్వామి వారు ఉదయం భక్తులకు వటపత్రశాయిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రథమ ప్రాకార మండపంలో వటపత్రశాయి అలంకార సేవకు ఆచార్యులు హారతినిచ్చారు. అనంతరం సేవను ఆలయ తిరువీధుల్లో, మాఢవీధుల్లో ఊరేగించారు. ఈ సేవలకు ముందు ఆచార్యులు, పారాయణికులు శాస్త్రోక్త పూజలతో, దివ్య ప్రబంధ పారాయణాలతో శ్రీస్వామిని కొలిచారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, జార్ఖండ్ శాసనసభ ప్రెస్ అడ్వైజరీ కమిటీ కన్వీనర్ ఆనంద్ మోహన్, కమిటీ సభ్యులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, అశోక్‌కుమార్, ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ అధికారులు, ప్రధానార్చకులు, రుత్వికులు, పారాయణీకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాత్రికి పరమపదనాథుడిగా..

ఆలయంలో నిత్యారాధనల అనంతరం అధ్యయనోత్సవాల్లో భాగంగా రాత్రి శ్రీస్వామి వారిని పరమపదనాథుడిగా (వైకుంఠనాథుడిగా) అలంకరించి సేవోత్సవం చేపట్టారు. ప్రధానాలయంలో ద్రావిడ ప్రబంధ సేవాకాలంలో పారాయణిక స్వాములచే, అర్చక స్వాములచే అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దివ్య మనోహరంగా వైకుంఠనాథుడిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుత్ కాంతుల వెలుగులో శ్రీస్వామి వారు తిరువీధి సేవకు వెళ్లి భక్తులకు దర్శనం కల్పించారు.

నేటితో ఉత్సవాలు ముగింపు..

అధ్యయనోత్సవాలలో భాగంగా శనివారం శ్రీస్వామివారు శ్రీనరసింహస్వామి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఆరు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో చివరి రోజు శ్రీనరసింహస్వామి అలంకార సేవతో ముగియనున్నట్లు ఆలయ ఆచార్యులు తెలిపారు.

పట్టువస్త్రాల బహూకరణకు అనుమతి ఇవ్వాలని వినతి



దేవస్థానం ఈఓ గీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి : యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణానికి పోచంపల్లి పట్టువస్త్రాల బహూకరణకు అనుమతి ఇవ్వాలని శుక్రవారం పోచంపల్లి పద్మశాలి మహాజన సంఘం ఆధ్వర్యంలో దేవస్థానం ఈఓ గీతారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు ఈఓ స్పందించి మాట్లాడుతూ.. పోచంపల్లి ఇక్కత్‌పట్టు వస్త్రాలను అందజేసేందుకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రత్యేక జీఓ జారీ చేసిందని తెలిపారు. ఇందుకు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఈఓకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, భోగ నర్సింహ, అంకం మురళి, భారత బాలరత్నం, కడవేరు చంద్రమౌళి, సంగెం చంద్రయ్య, వనం మల్లేశం, గుండు పాండు, కర్నాటి అంజమ్మ, చిట్టిమల్ల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

- రాష్ట్ర మంత్రి జగదీశ్‌రెడ్డి



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : విద్యుత్ ఉద్యోగులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో చేపట్టిన యోగా, ప్రాణాయామంపై సూర్యాపేట డివిజన్ విద్యుత్ ఉద్యోగుల ప్రత్యేక శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఈ పోటీ ప్రపంచంలో ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం చేయాలన్నారు. నియమ నిబంధనలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న యువకులు

- మతిస్థిమితం లేని వ్యక్తిని చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగింత



అమన్‌ను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ముస్లిం యువకులు

పెద్దవూర : మండల కేంద్రంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని స్థానిక ముస్లిం యువకులు చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఎండీ.జానిమియా అలియాస్ పోస్ట్ జానీ, పలువురు ముస్లిం యువకులు మండల కేంద్రంలో నాలుగైదు నెలలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఓ వ్యక్తిని చేరదీశారు. రోజు అతడికి భోజనం పెడుతూ దగ్గరికి తీశారు. ఈ క్రమంలో అతడితో మాటల్లో మాటలు కలుపుతూ పేరు, ఊరు అడిగేవారు. ఒక రోజు తన పేరు అమన్ అని, మాది మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్ అని చెప్పాడు. దీంతో జబల్‌పూర్‌కు చెందిన ఫోన్ నంబర్లను తెలుసుకుని వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. దీంతో అమన్ కుటుంబ సభ్యులు గురువారం రాత్రి పెద్దవూర వచ్చారు. అమన్ పరిస్థితిని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. కుమారుడు అమన్ 8నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, అతడి కోసం వెతకని రోజు లేదని, కుమారుడు కనిపించలేదని తీవ్ర మానసిక వేదనతో అతడి తండ్రి సిరాజ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అమన్ ఆచూకీ తెలిపిన జానీమియాకు, ముస్లిం యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు



అరుణను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి : భర్త వేధింపులు తాళ్లలేక ఇంటి నుంచి వెళ్లిన భార్య, ముగ్గురు పిల్లల మిస్సింగ్ కేసును శుక్రవారం స్థానిక పోలీసులు ఛేదించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గుర్రు నరేశ్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు నిత్యం మద్యం సేవించి వచ్చి భార్య అరుణను కొడుతున్నాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా భార్యాభర్తలు గొడవ పడ్డారు. భర్త వేధింపులు తాళలేక తీవ్ర మనస్థాపానికి గురైన అరుణ గురువారం సాయంత్రం భర్త ఇంట్లో లేని సమయంలో తన ముగ్గురు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం భర్త ఇంటికి వచ్చి చూసి వెతకగా భార్య, పిల్లలు కన్పించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో వారు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అరుణ చౌటుప్పల్ మండలం లక్కారం వద్ద పిల్లలతో ఉన్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం పోలీసులు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం భార్య భర్తలకు గొడవ పడకుండా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. కేసును 24గంటల్లో ఛేదించిన ఏఎస్‌ఐ సైదిరెడ్డి, కానిస్టేబుల్ యాదగిరిని ఎస్‌ఐ అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకుంటున్న కేంద్రం

- రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



మోత్కూరు : సమావేశంలో మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు : తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగానికి ఉచిత విద్యుత్, రైతు బంధు, రైతు బీమా, పంట రుణాల మాఫీ, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడంతో బీజేపీ ప్రభుత్వాలపై భారం పడుతుందని కేంద్రం భయపడుతుందన్నారు. పక్క రాష్ట్రాలు తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ వస్తుందన్నారు. 9నెలల్లో ఎన్నికలు రావొచ్చని, రెండు, మూడు గ్రామాలకు కలిపి వన భోజనాల ద్వారా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని అన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బి.కళ్యాణ్‌చక్రవర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రి, వైస్ చైర్మన్ బి.వెంకటయ్య, వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టి.మేఘారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రాంపాక నాగయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెడిపల్లి రఘుపతి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మల్లం అనిత, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు ఉన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషిచేయాలి

అడ్డగూడూరు : బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 8న మండలంలో చౌల్లరామారం శివారులో నిర్మించిన గిడ్డంగుల గోదాముల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ దర్శనాల అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, సోన్నాల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, నాయకులు తదతరులు పాల్గొన్నారు.



పట్టణంలో భూ కబ్జాలను అరికట్టాలి

- మంత్రులకు విన్నవించిన ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలో జరుగుతున్న భూ కబ్జాలపై తగిన చర్యలు తీసుకోవాలని మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలకు విన్నవించినట్లు నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని వందల కోట్ల రూపాయల మున్సిపాలిటీ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వాటిని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మంత్రలకు వివరించినట్లు ఆయన తెలిపారు. మఠంపల్లి మండలంలో వందల కోట్ల విలువైన 46ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కు తీసుకోవడానికి ఏమి ఇబ్బంది అని మంత్రులను, అధికారులను అడిగితే వాపస్ తీసుకుంటామని చెప్పారని తెలిపారు. లిస్ట్ ఆఫ్ ల్యాండ్‌ను తయారు చేయాలని ఆదేశించి దానిని నోటీస్ బోర్డుపై పెట్టాలని ఆదేశించారని ఆయన అన్నారు. ఆరు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్ కంప్యూటర్ లాగిన్ దొంగలించిన విషయంపై మంత్రులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని అన్నారు. ఈ ప్రాంతంలో అన్ని లిఫ్టులు నా హయాంలోనే నిర్మాణాలు జరిగాయని తెలిపారు. హుజూర్‌నగర్‌లో 50వేల ఓట్ల మెజార్టీతో ఈ సారి మేమే గెలువబోతున్నామని, ఇందులో ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లిఖార్జున్, యరగాని నాగన్న, సాముల శివారెడ్డి, భూక్యా గోపాల్, ఎండీ నిజాముద్దీన్, అరుణ్‌కుమార్, అల్లం ప్రభాకర్‌రెడ్డి, మోతీలాల్, కొట్టె సైదేశ్వరరావు, అజీజ్ పాషా, మహేష్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి



బాణావత్ కళ్యాణ్ మృతదేహం

డిండి : అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దేవత్‌పల్లితండాకు చెందిన బాణావత్ కళ్యాణ్(36)కు మండలంలోని పద్దతండాకు చెందిన దేవితో 17ఏళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి కళ్యాణ్ గ్రామంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. 4ఏళ్లుగా దంపతుల మధ్య జరుగుతున్న కుటుంబ కలహాలతో కళ్యాణ్ గ్రామంలో ఉంటుండగా దేవి హైదరాబాద్‌లో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 3న దేవి తల్లిగారి గ్రామమైన పెద్దతండాకు వచ్చింది. కాగా అదే రోజు రాత్రి కళ్యాణ్‌ను పెద్దతండాకు రావాలని దేవి కుటుంబ సభ్యులు కోరడంతో అతడు అక్కడికి చేరుకున్నాడు. ఈ క్రమంలో 4వ తేదీ తెల్లవారుజామున కళ్యాణ్ నిద్ర నుంచి లేవడంలేదని దేవితో పాటు ఆమె తల్లిదండ్రులు కళ్యాణ్ సోదరులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడికి చేరుకొని 108లో దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే కళ్యాణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కళ్యాణ్ అనుమానస్పదంగా మృతి చెందాడని మృతుడి సోదరుడు దూబ్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కట్రావత్ భద్యా, కట్రావత్ నారి, కాట్రావత్ భాస్కర్, స్వామి, చిన్నాతో పాటు మృతుడి భార్య దేవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ.సురేష్ తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు

- 24లీటర్ల నాటుసారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం స్వాధీనం



పట్టుబడిన నిందితులు, సారాతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని పడమటితండా, దుగ్యాల గ్రామాల్లో శుక్రవారం నల్లగొండ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 1500లీటర్ల పానకం, 24లీటర్ల నాటు సారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీశంభు ప్రసాద్, ఏఈఎస్ కిషన్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుగ్యాల, పడమటితండాలో దాడులు నిర్వహిస్తుండగా పడమటితండాకు చెందిన రమావత్ వెంకటేష్, కమిలియాలు ద్విచక్రవాహనంపై నాటుసారాను తరలిస్తూ పట్టుబడ్డారు. దీంతో సారా స్థావరాలపై దాడులు నిర్వహించగా 1500లీటర్ల పానకం, 24లీటర్ల నాటుసారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా 1500లీటర్ల పానకం డ్రమ్ములను ధ్వంసం చేసి, 24లీటర్ల సారా, 84కిలోల పటిక, 60కేజీల నల్లబెల్లం, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో సీఐలు భరత్‌భూషన్, రాఘవీణ, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, పాగరాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రీడలు

- కోదాడ అనురాగ్ కళాశాల మొదటి స్థానం, నాగార్జునసాగర్ ద్వితీయ స్థానం



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలల ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. ఈ క్రీడల్లో కోదాడ అనురాగ్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలువగా నాగార్జునసాగర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కబడ్డీ బాలికల విభాగంలో కిట్స్ కోదాడ విజేతగా నిలువగా, జీపీటీ తిరుమలగిరి రన్నర్‌గా నిలిచింది. బాలుర విభాగంలో జీపీటీ నాగార్జునసాగర్ టీమ్ విజేత కాగా, జీపీటీ నల్లగొండ రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ బాలికల విభాగంలో జీపీడబ్ల్యూ సూర్యాపేట టీమ్ విజేతగా, కిట్స్ కోదాడ రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ బాలుర విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల కోదాడ విజేతగా, జీపీటీ నాగార్జునసాగర్ రన్నర్‌గా నిలిచింది. ఖోఖో బాలికల విభాగంలో జీపీడబ్ల్యూ విజేత కాగా, జీపీటీ నల్లగొండ రన్నర్‌గా నిలిచింది. ఖోఖో బాలుర విభాగంలో జీపీటీ నల్లగొండ విజేతగా నిలువగా, జీపీటీ నాగార్జునసాగర్ రన్నర్‌గా నిలిచింది. చెస్ బాలికల విభాగంలో కిట్స్ కోదాడ విజేతకాగా, జీపీడబ్ల్యూ సూర్యాపేట రన్నర్‌గా నిలిచింది. చెస్ బాలుర విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా నిలువగా, జీపీటీ రన్నర్‌గా నిలిచింది. టేబుల్ టెన్నిస్ సింగిల్ బాలికల, బాలుర విభాగంలో విజేతగా అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల, రన్నర్‌గా నాగార్జునసాగర్ కళాశాల నిలిచింది. టేబుల్ టెన్నిస్ బాలుర, బాలికల విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా నిలువగా, రన్నర్‌గా జీపీడబ్ల్యూ సూర్యాపేట, జీపీటీ తిరుమలగిరి నిలిచాయి. బ్యాడ్మింటన్ సింగిల్ బాలికల విభాగంలో జీపీటీ నల్లగొండ విజేత కాగా, నాగార్జునసాగర్ రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ సింగిల్ బాలుర విభాగంలో నాగార్జునసాగర్ విజేతగా నిలువగా, జీపీటీ తిరుమలగిరి రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ డబుల్ బాలికల విభాగంలో జీపీటీ నల్లగొండ విజేతకాగా, అనురాగ్ కళాశాల రన్నర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ డబుల్ బాలుర విభాగంలో అనురాగ్ ఇంజనీరింగ్ కళాశాల విజేతగా, జీపీటీ తిరుమలగిరి రన్నర్‌గా నిలిచింది.

విశిష్ట సేవా పురస్కారానికి వెంకటాచారి ఎంపిక



వెంకటాచారి

రాజాపేట : మండలంలోని రఘునాథపురం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గడగోజు వెంకటాచారి సేవలను గుర్తించిన పుడమి సాహితీ వేదిక శుక్రవారం విశిష్ట సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. సాహితీ వేదిక తెలుగు తేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారాన్ని ఈనెల 8వ తేదీన నిర్వహించే సంస్థ 4వ వార్షికోత్సవంలో ఆ సంస్థ అధ్యక్షుడు చిలుగుల బాల్‌రెడ్డి అందించనున్నారు.

వైఎస్సార్‌టీపీ కార్యాచరణ కమిటీ సభ్యుడిగా పిట్టా రాంరెడ్డి



పిట్టా రాంరెడ్డి

చివ్వెంల (సూర్యాపేట) : వైఎస్సార్‌టీపీ కార్యాచరణ కమిటీ సభ్యుడిగా పిట్టా రాంరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ వ్యవస్థాపకురాలు వైఎస్ షర్మిల శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఆయన రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో ఎంపిక చేసినందుకు అధ్యక్షురాలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా, మండల నాయకులు అభినందనలు తెలిపారు.